క్లుప్తంగా

నాటక కళాకారుడు బసివిరెడ్డికి సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం స్వర్ణమంజరి చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం మేజర్ చంద్రకాంత్ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు జొన్నల బసివిరెడ్డిని ఘనంగా సన్మానించారు. సూరపనేని అనురాధ, శానంశెట్టి ఉమామహేశ్వరి, అప్పిరెడ్డి, కొల్లిపర శ్రీనివాస్, భీమవరపు బసివిరెడ్డి, జొన్నల ఈశ్వరరెడ్డి, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవానీ, సోమవరపు సాంబశివరావు, ఎన్టీఆర్ జగన్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను కొనుగోలు చేయాలి

తెనాలిటౌన్: గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల వల్ల మొక్కజొన్న, జొన్న, పసుపు పంటలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం స్పందించి తడిచిన పంటలను కొనుగోలు చేయాలని కాంగ్రెస్‌పార్టీ తెనాలి పార్టీ ఇన్‌చార్జి డాక్టర్‌చందు సాంబశివుడు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్యశశిధరరావు, మండల అధ్యక్షుడు కె.బుల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

కొలకలూరులో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు సచివాలయం-2 పరిధిలోని ఏబీఎం చర్చి వద్ద మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంపై వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ సుబ్బారావు రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంతో మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఈఓ నాగరాజు, సూపర్‌వైజర్లు జి.శ్రీనివాసరావు, లక్ష్మీప్రసన్న, ఎంఎల్‌హెచ్‌పీ రేవతి, ఏఎన్‌ఎంలు గజలక్ష్మి, జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

కాశీ గోవిందమ్మ ఆరాధనోత్సవాలు ప్రారంభం



తెనాలిటౌన్: పట్టణ టీబీ రోడ్డులోని విశ్వకర్మ దేవస్థానంలో కాశీ గోవిందమ్మ ఆరాధనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు, నారాయణస్వామి, భక్తులు పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గోవిందమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ ఈఓ ఎస్‌వీఎస్ మల్లీశ్వరి ప్రారంభించారు. నూతలపాటి సురేష్‌బాబు, యలవర్తి ఆంజనేయశాస్త్రి, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

లారీలకు జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళుతున్న లారీలకు అధికారులు జరిమానా విధించారు. కొల్లిపర మండలం అత్తోట వద్ద అధిక ఇసుక లోడుతో వెళుతున్న లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది మంగళవారం గుర్తించారు. లారీల యజమానులకు రూ. 10 వేల చొప్పున జరిమానా విధించారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

తెనాలిరూరల్: చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలోని ఓ ఇంట్లో ఈ నెల 7వ తేదీ రాత్రి నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసు, సెల్‌ఫోన్ అపహరణకు గురయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లెకి చెందిన తమ్మిశెట్టి గోపిగా గుర్తించి మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి గొలుసు, సెల్‌ఫోన్ స్వాధీన పర్చుకున్నారు.

14 నుంచి హనుమత్ జయంత్యుత్సవాలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో వేంచేసియున్న దక్షిణాముఖ ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు ఈ నెల 14నుంచి ప్రారంభించనున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి భక్తుల గోత్రనామాలతో పూజలు చేస్తారని చెప్పారు. 11 గంటలకు సువర్చల సమేత ఆంజనేయుడికి కల్యాణం నిర్వహిస్తారన్నారు.

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం

- మద్దతు ధర కన్నా తక్కువకు పంటలను విక్రయించొద్దు
- పలు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే శివకుమార్



అన్నవరంలో దెబ్బతిన్న పసుపు కొమ్ములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని, నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకొంటుందని, ప్రతి రైతు తమ పంటలను మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవద్దని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అన్నవరం, హనుమాన్‌పాలెం, తూములూరు, కొల్లిపర, చివలూరు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న పసుపు, మొక్కజొన్న, అరటి పంటలను పార్టీ నాయకులు, వ్యవసాయాధికారులతో కలసి పరిశీలించారు. పంట నష్టంపై అధికారులను, నష్టపోయిన రైతులను సమస్యలను అడిగి తెసుకొని వాటిని జిల్లా అధికారులతో చర్చించి రెండు రోజులలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వారంలో కొనుగోలు కేంద్రాల ద్వారా నష్టపోయిన రైతుల వద్ద నుంచి పంటలను కొనుగోలు చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్పష్టంగా చెప్పటం జరిగిందన్నారు. టీడీపీ నాయకులు రాజకీయంగా ఉనికి కోల్పోగా, రైతుల ముసుగులో రాజకీయం చేస్తున్నట్లు ఎద్దేవా చేశారు. రైతులపై సానుభూతి లేకపోగా రాజకీయం చేయటం దురదృష్టకరం అని అన్నారు. టీడీపీ పరిపాలనలో రైతులకు ఏం న్యాయం జరిగిందో అందరికీ తెలుసన్నారు. రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యం వల్ల రైతులకు తీవ్రనష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ రైతు నష్టపోకుండా ప్రతి గ్రామంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా, ఉద్యాన శాఖ, వ్యవసాయశాఖ, రెవెన్యూ సిబ్బంది ద్వారా క్షేత్రస్థాయిలో పంటనష్టం అంచనా వేస్తున్నారని, రెండు రోజుల్లో విధి విధానాలు వస్తాయని వెల్లడించారు. కొల్లిపర మండలంలో 1800 ఎకరాల్లో పసుపు పంట వేయటం జరిగిందని తద్వారా 44వేల క్వింటాలు పసుపు నమోదు చేయటం జరిగిందన్నారు. త్వరలోనే పసుపు కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం చివలూరులో మున్నంగి నుంచి చివలూరు వచ్చే 4 కిలోమీటర్ల డొంక రోడ్డుల్లో పూర్తిగా దెబ్బతిన్న వంతెనను పరిశీలించారు. అధికారులను వెంటనే నూతన వంతెన నిర్మాణం కొరకు నివేదిక తయారు చేసి నిర్మాణ పనులను వెంటనే ప్రాంభించాలని ఆదేశించారు. తొలుత ఆయా గ్రామాలలోని రైతులు కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న గింజలు మొలకెత్తుతున్నాయని, ఫంగస్ రావటం, రంగుమారి, నాణ్యత దెబ్బతింటుందని, పసుపు నాణ్యత, రంగు మారటం, పసుపు కొమ్ములకు బూజు రావటం వంటివి చూపించి ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలి ఉద్యానశాఖాధికారి విజయ్‌మోహన్ , ఏడీఏ కె.వెంకటరావు, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు తాత శ్రీనివాసరావు, భీమవరపు సంజీవరెడ్డి, తుమాటి రాజు, మర్రెడ్డి సాంబిరెడ్డి, అవుతు పోతిరెడ్డి, కళ్ళం వీరారెడ్డి, బొంతు వేణుగోపాలరెడ్డి, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



తూములూరులో రంగు మారిన మొక్కజొన్న గింజలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ వెంకట్రావు

తెనాలి: ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న అత్యంత ప్రధానమైన సమస్య డ్రగ్స్ అని, నేటి యువతరం వీటికి దూరంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందని టూటౌన్ సీఐ వెంకట్రావు చెప్పారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ స్టెప్, గుంటూరు, ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. సీఐ వెంకట్రావు మాట్లాడుతూ తెనాలి, పరిసర ప్రాంతాల్లో గంజాయి విరివిగా లభిస్తోందని, దీనిని అరికట్టేందుకు పోలీసుశాఖ ఎంతగానో కృషిచేస్తోందని తెలిపారు. గంజాయి విక్రయ మూలాలను ఛేదించేందుకు పోలీసులు చేస్తున్న కృషికి సమాజం తోడుగా నిలవాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన యువతతో ఆయా కుటుంబాలు మాత్రమే కాకుండా పరిసరాల్లోనివారు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. డ్రగ్స్ జోలికి వెళ్లకుండా ఉండటంతోనే మనం నియంత్రణ చేయొచ్చని వివరించారు. 'స్టెప్' సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతి విద్యార్థి తమ వంతు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఇందుకోసమే డిపార్టుమెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ అవగాహన సదస్సులను చేపడుతున్నట్టు వివరించారు. ఎన్ఎస్ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైకుంఠపురంలో వార్షిక బ్రహ్మోత్సవాలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

తెనాలి: స్థానిక లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం, వైకుంఠపురంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం నిత్యహోమం, ఆలయ బలిహరణ, నవ కుంభారాధన నిర్వహించారు. భక్తులు, దేవస్థాన అర్చకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి నృత్యప్రదర్శన పోటీలు జరిగాయి. జూనియర్స్ విభాగంలో కంతేటి గగనశ్రీ ప్రథమ బహుమతిని గెలుచుకోగా, లక్ష్మీప్రణతి ద్వితీయ బహుమతిని, సుజిత్ తృతీయ బహుమతిని గెలిచారు. సీనియర్స్ విభాగంలో సీహెచ్ వైష్ణవి, జి.సాత్విక, యు.హారికలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలిచారు. దేవస్థాన ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ వుప్పల వరదరాజులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు విజేతలకు బహుమతులను అందజేశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు ఆకుకూరలను పంపిణీ చేస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

మున్నంగి(కొల్లిపర): గర్భిణులు ప్రతి రోజు తమ ఆహారంలో పోషకాహార విలువలు కలిగిన ఆకు కూరలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మున్నంగి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఆకు కూరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు బిడ్డకు జన్మనిచ్చేవరకు వైద్యులు తెలిపిన విధంగా మందులు, ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం వారికి ఉచితంగా హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, యూరిన్, అల్బుమిన్ షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, దాత చందూరు భాస్కరరావు, వంగర బుజ్జిబాబు, పీహెచ్ఎన్ కోటేశ్వరి, హెల్త్ విజిటర్ దమ్ము ఆశీర్వాదమ్మ, స్టాఫ్ నర్స్ కల్పన, ప్రశాంతి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహా ఫన్ గేమ్ విజేతకు ఎలక్ట్రిక్ స్కూటర్ బహుమతి



విజేతకు ఎలక్ట్రిక్ స్కూటర్ అందజేత

తెనాలి: ది తెనాలి డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆహా ఫన్ అండ్ ఫ్యామిలీ గేమ్ షోలో విజేత రేష్మాకు మంగళవారం ఎలక్ట్రిక్ స్కూటర్‌ను బహుమతిగా అందజేశారు. స్థానిక గంగానమ్మపేటలోని జీఏకే ఏజెన్సీస్‌లో ఈ కార్యక్రమం జరిగింది. టప్పర్‌వేర్ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్, వి ఫర్నిచర్ మాల్, వీవర్స్ సొసైటీలు సమకూర్చిన ఉపకరణాలను, రిమ్‌జిమ్ వారు ఇచ్చిన దుస్తులను జేఎంజే కాలేజీ నిర్వహణలోని స్వధార్ హోమ్‌కు, ఆరో వార్డులో మంచానికే పరిమితమైన శ్రీకాంత్‌కు, కోవిడ్‌తో తల్లిని కోల్పోయిన ఆరో వార్డుకు చెందిన బాలికకు అందజేశారు. లక్కరాజు సాయి, సునీల్, అచ్యుత సాంబశివరావు, రాజేంద్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

సంక్షేమ పథకాలతో పేదల బతుకుల్లో వెలుగులు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శివకుమార్



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల బతుకుల్లో వెలుగులు నిండుతున్నాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం తెనాలి మండలం పెదరావూరు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్ నుంచి మొదటిరోజు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ సర్పంచి కాకి రమాదేవి, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గ్రామ ఎంపీటీసీ రావూరి సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, సంబంధిత అధికారులతో కలసి గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. గత మూడున్నరేళ్లలో అందించిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పొందిన లబ్ధిని వివరించారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపుదల, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ భరోసా, జగనన్న చేదోడు, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్ మెంట్, వైఎస్సార్ నేతన్న నేస్తం, సున్నా వడ్డీ రుణాలు, రైతు భరోసా పథకాలు, ఆరోగ్య శ్రీ సేవలు, తదితర పథకాల ద్వారా అర్హులైన వారికి ఏ విధంగా లబ్ధి చేకూరుతుందో వివరించారు. అనంతరం మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగ పర్చుకుంటున్నారని, గడప గడపకు వెళుతుంటే ఆ వివరాలు తెలుస్తున్నాయని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట కోసం ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎదుర్కొని, ఈ పథకాలను అమలు పరిచారని తెలిపారు. డ్రెయినేజీ సమస్యను ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని, సాధ్యమైనంత త్వరలో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కుదరవల్లి శంకరరావురావు, కాకి మనోజ్, రావూరి విజయ్, బాలరాజు, రావూరి శ్రీను, వేమూరి శ్రీను, కౌన్సిలర్లు యాతాటి అనిల్, షేక్‌దుబాయ్ బాబు, కఠారి హరీష్, బూరెల దుర్గ ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్



మంగళగిరి: ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని మంగళగిరి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సీజ్ చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం నుంచి మంగళగిరికి ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని మార్గంమధ్యలోని యర్రబాలెం పొగాకు కంపెనీ వద్ద మంగళవారం సెబ్ సీఐ మారయ్యబాబు ఆదేశాల మేరకు సెబ్ ఎస్‌ఐ మల్లికార్జునరావు నేతృత్వంలో సిబ్బంది గోవింద్, హనుమంతు తనిఖీలు నిర్వహించారు. డ్రైవర్ వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి డ్రైవర్‌తో మంగళగిరి రూరల్ పోలీసులకు అప్పగించగా రూరల్ ఎస్‌ఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తడిచిన పంట కొనుగోలు చేయాలని వినతి

తాడేపల్లిరూరల్: ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పసుపు, పెసర పంటలను కొనుగోలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు డిమాండ్ చేశారు. దుగ్గిరాల డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణికి మంగళవారం వినతిప్రతం అందజేశారు. బాలరాజు మాట్లాడుతూ పసుపు పంట కల్లాల్లో ఉండి తడిసిపోవడంతో దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని అన్నారు. మండల కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం



తెనాలిరూరల్: అగ్నిప్రమాదంలో మొక్కజొన్న చేలు దగ్ధమయ్యాయి. తెనాలి మండలం అంగలకుదురులోని పిడపర్తి ప్రదీప్‌కుమార్, కూచిపూడి లక్ష్మయ్య, నలుకుర్తి నాగరాజులకు చెందిన సుమారు మూడెకరాల్లోని మొక్కజొన్న పంట మంగళవారం అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న తెనాలి అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు నమోదు చేశారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఉండడంతో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించి ఉంటుందని నిర్ధారణకు వచ్చారు. సుమారు రూ.2.5 లక్షల ఆస్తినష్టం సంభవించి ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

తొమ్మిది కిలోల కణితి తొలగింపు

తెనాలిరూరల్: మహిళ అండాశయంలో ఉన్న తొమ్మిది కిలోల కణితిని వైద్యులు తొలగించారు. 31 ఏళ్ల మహిళ తీవ్రమైన కడుపు నొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో పట్టణ కొత్తపేటలోని దేవి నర్సింగ్ హోం(రవీందర్ బాబు హాస్పటల్)కు వచ్చింది. పరీక్షలు చేయించిన వైద్యులు మహిళ అండాశయంలో కణితి ఉన్నట్టు గుర్తించారు. మంగళవారం శస్త్రచికిత్స చేసి తొమ్మిది కిలోల కణితిని తొలగించారు. డాక్టర్ ఈద్పుగంటి మౌనిక, డాక్టర్ ముత్తవరపు రామలింగేశ్వరరావు, అనస్థిటిస్ట్ డాక్టర్ ప్రసాద్ శస్త్ర చికిత్స చేశారని నర్సింగ్ హోం వైద్యులు డాక్టర్ కొత్త రవికిరణ్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉండవల్లి అమరావతి కరకట్ట నుంచి కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వరకు కృష్ణా కరకట్ట ప్రాంతం, కేఎల్ రావు కాలనీ, ఆశ్రమం రోడ్, సీతానగరం ప్రాంతాల్లో అత్యవసర విద్యుత్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణం 2వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేశారు. బైపాస్ రోడ్డులోని టవర్ రోడ్డు బజారులో కొండ్రుకాని నాగేశ్వరరావు ఇంటి వద్ద నుంచి గరికపాటి నాంచారమ్మ ఇంటి వరకు 150 మీటర్ల పొడవున 3.5 మీటర్ల వెడల్పున 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, ఒకవైపు డ్రెయిన్ నిర్మాణం పూర్తిచేసినట్లు ఏఈ కిషోర్ తెలిపారు. ఈ కాలనీ ఏర్పడిన దగ్గర నుంచి రహదారి లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణం చేసినట్లు తెలిపారు.

మంగళగిరి రూరల్ ఎస్‌ఐగా జగన్‌మోహన్‌రావు

మంగళగిరి: మంగళగిరి రూరల్ ఎస్‌ఐగా బి జగన్‌మోహన్‌రావును నియమిస్తూ జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మంగళగిరి రూరల్ ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన బి విజయ్‌కుమార్‌రెడ్డిపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో బి జగన్ మోహన్‌రావును మంగళగిరి రూరల్ ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే రెండవ రూరల్ ఎస్‌ఐగా రమేష్‌బాబు విధులు నిర్వర్తిస్తున్నారు.

మద్యం మత్తులో జీవితాలు పాడు చేసుకోవద్దు



మద్యం తాగి ద్విచక్రవాహనం నడిపేవారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న తాడేపల్లి సీఐ శేషగిరిరావు

తాడేపల్లిరూరల్: మద్యం మత్తులో ద్విచక్రవాహనాలు నడిపి జీవితాలు నాశనం చేసుకోవద్దని తాడేపల్లి సీఐ శేషగిరిరావు అన్నారు. మంగళవారం సాయంత్రం వివిధ ప్రాంతాల్లో మద్యం తాగి ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న 8 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి ద్విచక్రవాహనాలను, ఇతర వాహనాలను ఇష్టం వచ్చినట్లు నడపడం వల్ల మీ ప్రాణాలతోపాటు, ఎదుటివారి ప్రాణాలు కూడా పోయే అవకాశం ఉందని అన్నారు. మద్యం మత్తులో ద్విచక్రవాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోయిన ఎంతో మంది కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని, ఎవరూ మద్యం తాగి వాహనాలు నడపవద్దని అన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం తాగి వాహనాలు నడిపినా తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేసిన హైకోర్టు ఏజీపీ



మంగళగిరి: నగరంలోని గ్రంథాలయానికి స్థానిక ఏపీఎస్పీ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన హైకోర్టు ఏజీపీ అప్పల షణ్ముఖరెడ్డి మంగళవారం న్యాయవ్యవస్థపై అవగాహన కల్పించే పుస్తకాలు, నిరుద్యోగులు, విద్యార్థులకు ఉపయోగపడే పోటీ పరీక్షలకు సంబంధించిన తెలుగు, ఇంగ్లీషు మీడియం పుస్తకాలు 76 లైబ్రేరియన్ ఆరోగ్యంకు అందజేశారు. హైకోర్టు ఏజీపీ షణ్ముఖరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు న్యాయ వ్యవస్థపై, చట్టాలపై అవగాహన కలగాలనే ఉద్దేశంతో పుస్తకాలను అందజేయడం జరిగిందన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద, మధ్యతరగతి నిరుద్యోగులు, విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు అందజేశామన్నారు. ప్రజలు, నిరుద్యోగులు, విద్యార్థులు ఉపయోగించుకుని మంచి విజ్ఞానాన్ని పొందాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్తులో గ్రంథాలయానికి మరిన్ని పుస్తకాలను అందజేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వేసవి సాగులో పాటించాల్సిన పద్ధతులు గురించి రైతులకు సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ ఉపసంచాలకుడు రామాంజనేయులు మాట్లాడుతూ పొలంలో పంట వ్యర్థాలను కాల్చివేయకుండా రోటోవేటర్ ద్వారా కలియదున్నాలని చెప్పారు. రైతులు మట్టి నమూనాలు సేకరించి రైతు భరోసా కేంద్రాల ద్వారా పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వాడుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ప్రవీణ, రాజామణి, ఏవో రమణకుమార్, విస్తరణాధికారి షేక్.సుభాని, మల్లికా గణేష్, రాంబాబు, శివారెడ్డి, కిరణ్, రైతులు పాల్గొన్నారు.